సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం। 12। ఫిబ్రవరి। 2024



టమాటా.. బతుకు బాట!
మదనపల్లె వ్యవసాయ టమాటా మార్కెట్ ఆసియా ఖండంలోనే అతి పెద్దది. ఈ మార్కెట్‌పై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. -8లో



విద్యార్థులను తీర్చిదిద్దాలి
మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్యాలను నేర్పుతూ ప్రపంచస్థాయి పోటీలను తట్టుకునేలా తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 83 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	380	380
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 114.920 కిలోలు

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి నేడు (సోమవారం) స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 5–ఏ ఆంధ్ర బెటాలియన్, 35 –ఏ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలతో పాటు ఎన్‌సీసీ డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్‌పై విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఇందులో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వివిధ పాఠశాలల నుంచి ఎన్‌సీసీ విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేయనున్నట్లు ఎన్‌సీసీ అధికారిణి దేవకమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ఈశ్వరమ్మ, అన్సర్‌బాషా, గిరిధర్, వనిత, చంద్రశేఖర్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫీల్డ్ ఆర్చరీలో ప్రతిభ



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: మహారాష్ట్రలోని పూణేలో ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన 14వ జాతీయ ఫీల్డ్ ఇండోర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ జట్టు 15 స్వర్ణం, 5 రజతం, 8 కాంస్యపతకాలతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో మూడోస్థానంలో నిలిచినట్లు ఏపీ ఫీల్డ్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి వర్ది చెన్నకేశవులు తెలిపారు. అదే విధంగా వైఎస్సార్ జిల్లాకు చెందిన క్రీడాకారులు అండర్–10, అండర్–14, అండర్–17, అండర్–19, సీనియర్ విభాగాల్లో మొత్తం 20 పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు.

వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం



సాబ్‌బావి అటవీ ప్రదేశంలోని సాసర్‌ఫీట్‌లో తాగునీరు నింపుతున్న అటవీ సిబ్బంది

సిద్దవటం: సిద్దవటం రేంజిలోని సాబ్‌బావి బీటు, గొల్లపల్లి బీటు అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు ఆదివారం తాగునీటి సౌకర్యం కల్పిచామని రేంజర్ బి. కళావతి తెలిపారు. కడప డీఎఫ్ఓ ఆదేశాల మేరకు వేసవిలో అడవిలో ఉన్న వన్యప్రాణులు తాగునీటి కోసం గ్రామాల్లోకి రాకుండా తాము ట్యాంకర్లతో తాగు నీరును అటవీ ప్రదేశంలో ఉన్న సాసర్ పీట్లలో నింపుతున్నామన్నారు.అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రజలు అడవికి నిప్పు పెట్టరాదని, దీనివల్ల అడవి జంతువులు, పక్షులు మరణించే ప్రమాదం ఉందన్నారు. అడవి జంతువులకు ముప్పు వాటిల్ల కుండా వాటిని కాపాడేందుకు, అడవులను రక్షించేందుకు అందరూ ముందుకు రావాలన్నారు డీఆర్ఓ కె. ఓబులేస్, , ఎఫ్‌బీఓలు రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, సాబ్‌బావి బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయిలో జరిగిన ఎడ్యుకేషన్ ఈపిపానీ మెరిట్ టెస్టు(ఈఈఎంటీ) ఆన్‌లైన్ టాలెంట్ టెస్టులో పొద్దుటూరు రామేశ్వరం మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన ఎంజర్ల ప్రణీత్ రెడ్డి, ఎంజర్ల ప్రవీణ్‌రెడ్డిలు ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయిలో మొదటి, రెండో ర్యాంకును సాధించారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో వివిధ దశల్లో జరిగిన ఈఈఎంటీ –2024 ఆన్‌లైన్ పరీక్షల ఫలితాల్లో 7వ తరగతికి సంబంధించి 83 మార్కులు ప్రణీత్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు, 77 మార్కులతో ప్రవీణ్‌రెడ్డిలు రెండో ర్యాంకు సాధించారు. వీరి తండ్రి యంజర్ల సుధాకర్‌రెడ్డి స్కూల్ అసిస్టెంట్ బయాలజీ టీచర్‌గా పొద్దుటూరు మున్సిపల్ హైస్కూల్లో పనిచేస్తున్నారు. ఇందులో మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండో బహుమతి రూ. 15 వేలు ఈనెల 18న జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో కమిషనర్ చేతులు మీదుగా అందుకోనున్నారు.

ఈ–క్రాప్..రైతు సేఫ్

- ఆన్‌లైన్‌లో పంటల నమోదుతో ఎంతో లాభం
- ఈక్రాప్ సర్టిఫికెట్లతో బ్యాంకుల్లో రుణాలు



ఎల్లుట్లలో రైతులపొలాల్లో సాగుచేసిన పంటలపై ఈ–క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు

గుర్రంకొండ: ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టాలను చవిచూస్తున్న రైతులకు ఈ–క్రాప్ నమోదుతో ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు ఉమ్మడిగా ఈ –క్రాప్ నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ గత నెలరోజులుగా ముమ్మరంగా సాగుతోంది. పంటల సాగు వివరాలు నమోదు చేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు తాము పండించిన పంటలు నష్టపోతే ప్రభుత్వం సాయం అందించడానికి వీలుంటుంది. ఈక్రాప్ సర్టిఫికెట్లతో బ్యాంకుల్లో పంట రుణాలుకూడా పొందే అవకాశం ఉంది. సాధారణ రైతులతో పాటు కౌలురైతులకు పంటనష్టపరిహారం అందనుండడం గమనార్హం.

90 శాతం పూర్తి

జిల్లా వ్యాప్తంగా ఈ– క్రాప్‌నమోదు ప్రక్రియ 90శాతం మేరకు పూర్తయింది. రబీ సీజన్‌లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అన్ని రకాల పంటల సాగు మొత్తం విస్తీర్ణం 94850 ఎకరాలు ఉంది. ఇందులో ఇప్పటివరకు 85423 ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా పంటలను ఈక్రాప్‌నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం ఈనెల 15 వరకు గడవు పొడిగించింది. దీంతో మిగిలిన పదిశాతం కూడా పూర్తిచేసేందుకు జిల్లావ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది కృషి చేస్తున్నారు.

రైతులకు ప్రభుత్వం ఆసరా

నెలరోజులుగా గ్రామాల్లో రబీసీజన్లో పంటల సాగు ప్రక్రియ నిరంతంగా కొనసాగుతోంది. ఈ ఏడాది ప్రభుత్వం రబీ సాగుపై దృష్టి సారించింది. ఇందు కోసం రైతులకు ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెచ్చి ఆసరా కల్పించింది. పంటల సాగు కోసం అవసరమైన సబ్సిడీ ఎరువులు ఆర్‌బీకేలకు సరఫరా చేసింది. రైతులకు ఈసీజన్‌ల్లో అవసరమైన అన్ని రకాల ఎరువులను ఆర్బీకేల్లో ప్రభుత్వం అందుబాటుల్లో ఉంచింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కౌలురైతులకు పరిహారం



గత ప్రభుత్వాలలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వం కౌలురైతులకు పంటనష్టపరిహారం అందిస్తోంది. గతంలో పొలాన్ని కౌలురైతులు కౌలుకు తీసుకున్నా పంట నష్ట పరిహారం మాత్రం యజమానులకే అందేది. ప్రస్తుతం ఒకసారి కౌలురైతుల గుర్తింపు కార్డులు జారీ చేస్తే ఈ క్రాప్ నమోదులో ఆన్‌లైన్‌లో సదరు పొలం కౌలురైతులకు ఇచ్చినట్లు చూపిస్తుంది. దీంతో పొలం యాజమానులకు కాకుండా నిజమైన కౌలురైతుల పేరు మీదే ఈక్రాప్ నమోదు చేస్తున్నారు. రైతుభరోసా మాత్రం పొలం యజమానులతో పాటు కౌలురైతులకు అందుతోంది. ఈక్రాప్ నమోదుతో పంట నష్టపరిహం మాత్రం కౌలురైతులకు నేరుగా అందనుంది.

- ప్రస్తుత రబీసీజన్‌లో చేపట్టిన ఆన్‌లైన్‌లో ఈక్రాప్ బుకింగ్‌తో రైతులకు పంట రుణాలు కూడా మంజూరవుతున్నాయి. వ్యవసాయశాఖ సిబ్బంది జారీ చేసే ఈక్రాప్ బుకింగ్ సర్టిఫికెట్లతో బ్యాంకుల్లో కొత్తగా పంటరుణాల మంజూరుతో పాటు పాత రుణాలు కూడా రెన్యూవల్ చే సేందుకు ఈప్రక్రియ దోహద పడుతోంది.

ఇవీ ప్రయోజనాలు



ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటసాగు చేసి నష్టపోయిన రైతులకు నేరుగా నష్టపరిహారం పొందే వెసులు బాటు ఉంటుంది. దళారుల చేతికి బీమా పరిహారం అందదు. ప్రభుత్వమే పూర్తిస్థాయిలో రైతుల తరఫున బీమా సొమ్ము చెల్లిస్తోంది. దీంతో పంటనష్టపోయినప్పుడు గతంలో ఈ క్రాప్ ద్వారా రైతు ఎంత మేరకు పంట సాగు చేశాడో వివరాలు తెలుస్తాయి. అలాగే పంట మార్పిడికి వీలు ఉంటుంది. పంటల వివరాల ఆధారంగా ఉత్పత్తుల లభ్యతపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. దిగుబడుల అంచనాకు ఇది సరైన విధానం. ఎరువులు, పురుగుల మందులు, ఎంతమేరకు అవసరం అవుతాయో ఆయా పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు (ఆర్‌బీకే) తెలుస్తుంది. దీంతో ఈక్రాప్ నమోదు రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా మారుతోంది.

ఎంతో మేలు జరుగుతోంది



ఈక్రాప్ నమోదుతో ఎంతో మేలు జరుగుతోంది. ప్రభుత్వమే రైతుల తరఫున బీమా సొమ్ము చెల్లించడం ఆనందంగా ఉంది. పంటలు నష్టపోతే ఎవరి చుట్టూ తిరగకుండా ప్రభుత్వమే తమను ఆదుకుంటోంది. – గోపాల్, సుంకరవాండ్లపల్లె

కౌలురైతులకు న్యాయం జరిగింది



గతంలో ఎన్నడూ లేనివిధంగా కౌలురైతులకు ఈక్రాప్ ద్వారా న్యాయం జరిగింది. తాము సాగుచేసిన పంటను పరిశీలించి పంటనమోదు చేస్తున్నారు. తద్వారా అర్హులైన కౌలు రైతులకు మేలు జరుగుతోంది. పంటనష్టం సంభవిస్తే నేరుగా కౌలురైతులకే నష్టపరిహారం ఇస్తున్నారు. – నరేంద్ర, కౌలురైతు, దౌలత్‌ఖాన్‌పల్లె

సద్వినియోగం చేసుకోవాలి



ఈక్రాప్ నమోదు చేసుకోవడం వల్ల రైతులకు ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా రైతుభరోసా, పంట నష్టపరిహారం తప్పనిసరిగా అందుతాయి. ముఖ్యంగా కౌలురైతులకు కుడా రైతుభరోసాతో పాటు పంటనష్టపరిహారం కూడా వస్తుంది. రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – వాణిశ్రీ, ఏడీఏ, వాల్మీకిపురం

నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి



రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులతో సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరంప్రభాకర్‌రెడ్డి

బద్వేలు అర్బన్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే తమ ఆలోచనలకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ జిల్లా బద్వేలులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యదశ నుంచే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో జరిగే మార్పులను గమనించాలన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ ఏటా నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా సైన్స్‌పై ఆసక్తి కలుగుతుందన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటో, ప్రశంసాపత్రం అందజేశారు.

రాష్ట్రస్థాయికి 14 ప్రదర్శనలు ఎంపిక

జిల్లా వ్యాప్తంగా 140 ప్రదర్శనలు రిజిస్ట్రేషన్లు కాగా జ్యూరీ సభ్యులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 14 ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశా రు. వీటిలో సాత్విక్..జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బద్వేలు, బి.గణేష్.. ఉప్పలవాండ్లపల్లె ఉన్నత పాఠశాల, చక్రాయపేట మండలం, డి.చరణ్..నరహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాపాడు మండలం, ఎస్.ఆసిఫా.. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చాపాడు, సి.చాతుర్య.. ఎస్.కె.సి.బి.ఎస్. ఉన్నత పాఠశాల ప్రొద్దుటూరు, ఎం.రుగ్వేద.. కమలాపురం, హితేన్‌జైన్.. నాగార్జున ఉన్నత పాఠ శాల కడప, అభిలాష్.. నాగార్జున మోడల్ స్కూల్ కడప, సయ్యద్ సోఫియా.. నిర్మల హైస్కూల్ కడప, ఆర్.గౌతమి.. బెడుదూరు ప్రాథమికోన్నత పాఠశాల కొండాపురం, బండిప్రగతి.. కొమ్మనూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగాల మండలం, ఎం.షర్మి.. విద్యాధరి ఉన్నత పాఠశాల పులివెందుల, నిత్యపూజయ్య నలంద ఉన్నత పాఠశాల సిద్దవటం, ఎం.అభిలాష్.. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిద్దవటం ప్రదర్శనలు ఉన్నాయి.

ఘనంగా లూర్దుమాత తిరునాల





ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాను ఆశీర్వదిస్తున్న బిషప్ గాలి బాలి, బండ లాగుతున్న ఎద్దు

కడప కల్చరల్: కరుణామయి, ప్రేమమూర్తి ఏసుక్రీస్తును ఈ లోకానికి అందించిన దయగల తల్లి లూర్దు మాత తిరునాల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మరియాపురంలోని పాత గుడివద్ద బిషప్, కడప అపోస్థలిక పాలనాధికారి గాలి బాలి సమష్టి బలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూర్దుమాత ఆశీస్సులతోనే నవదిన ఉత్సవాలు వైభవంగా నిర్వహించగలిగామని, ఆమెతోపాటు ప్రభువైన ఏసుక్రీస్తుకు దైవానికి కృతజ్ఞతలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన లూర్దుమాత దర్శనమిచ్చిన సంఘటనలను వివరించి వాక్యపరిచర్య చేశారు. మరియాపురం క్రీస్తు జ్యోతి కాన్వెంట్ ప్రతినిధులు వేదికను, ప్రార్థనా పీఠాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు. కడప మేత్రాసనం ఫాదర్లు సంబటూరు సురేష్, బాకే రవీంద్ర సంగీత సహకారం అందజేశారు. రెవరెండ్ ఫాదర్ గుడిసెలపల్లి సుధాకర్ దైవార్చన కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కడపలోని డాన్ బాస్కో ఐటీఐ వద్ద నుంచి భక్తులు మరియమాత స్వరూపాన్ని ఊరేగింపుగా మరియాపురంలోని పాత చర్చి వద్దకు తీసుకొచ్చారు. ఫాదర్ ఆరోగ్యరాజ్ దివ్య సత్ ప్రసాద ఆరాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నగర ప్రముఖులు లూర్దుమాత ఆరాధనలో పాల్గొని బిషప్ ఆశీస్సులు పొందారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాష, స్థానిక కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సందడే సందడి: లూర్దుమాత నవదిన ఉత్సవాల ముగింపు సందర్భంగా పాత చర్చి ఆవరణలో తిరునాల ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బండ లాగుడు పోటీలను నిర్వహించారు. విజేతలైన ఎద్దుల యజమానులకు అతిథులు బహుమతులు అందజేశారు. ప్రాంగణమంతా రంగుల రాట్నాలు, కొలంబస్, జాయింట్ వీల్, బొమ్మ రాకెట్లు, బొమ్మ ట్రైన్‌లతో పిల్లల కేరింతలతో సందడిగా మారింది.

కడపరాయా..కరుణించవయ్యా



కోలాటం ఆడుతున్న మహిళలు




పెద్దశేష వాహనంపై విహరిస్తున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి

సూర్య, శేష వాహనాలపై దేవదేవుడు

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారు సూర్యప్రభ, రాత్రి పెద్ద శేష వాహనంపై విహరించారు. ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. నాదస్వర విన్యాసాల మధ్య కళాకారుల భక్తికీర్తనలతో ఊంజల్‌సేవ ఉల్లాసంగా సాగింది. ఉదయం అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామి సూర్యనారాయణమూర్తి అలంకారంలో గ్రామోత్సవానికి తరలి వెళ్లారు. రాత్రి పెద్ద శేషవాహనంపై భక్తుల జయజయధ్వానాల మధ్య మాడవీధుల్లో దర్శనమిచ్చారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు వారికి మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో టీటీడీ కళాకారుల అన్నమాచార్య కీర్తనలు, ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథాగానం భక్తులను అలరించింది. ఊరేగింపులో మహిళా భక్తుల కోలాట బృందాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. స్వామి పల్లకీలో మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తుండగా, మహిళా భక్తులు పసుపు వర్ణ సంప్రదాయ దుస్తులు ధరించి దేవతామూర్తులను కొనియాడుతూ భక్తిగీతాలను కోలాట నృత్యాలు చేశారు. స్థానిక భక్తులు కూడా వారితోపాటు కోలాటాలాడారు.

టీడీపీలో హైటెన్షన్!

- టికెట్ ఆశావహుల ఆవేదన
- రాయచోటిలో ఓపెన్‌గా వ్యాఖ్యానించిన ఓ నేత
- ప్రొద్దుటూరు, కమలాపురం, కడప, రాజంపేట నేతల్లో కూడా అదే పరిస్థితి



సాక్షి ప్రతినిధి, కడప: రాజకీయ పొత్తులు సమీకరణలతో అధిష్టానం తల బద్దలు కొట్టుకుంటుంటే, టికెట్ ఇస్తారో లేదో తెలియడం లేదు, ఎంతకాలం నాన్చుడు ధోరణి అని తెలుగుతమ్ముళ్లు మదనపడుతున్నారు.దీంతో టికెట్ ఆశావహుల్లో హైటెన్షన్ నెలకొంది. ప్రతి రోజు బీపీ చెక్ చేసుకుంటున్నామని, ఎంతమంది తమలాగా ఇబ్బంది పడుతున్నారో అర్థం కావడం లేదని ఓ మాజీ ఎమ్మెల్యే రాయచోటిలో బాహాటంగా వ్యాఖ్యానించారు. ఇదే పరిస్థితి జిల్లాలో పలు నియోజకవర్గాల్లో నెలకొంది.

వైఎస్సార్‌సీపీకి ప్రజాబలం గణనీయంగా ఉన్న నేపథ్యంలో సింగిల్‌గా ఢీకొట్టలేమని భావించిన తెలుగుదేశం పార్టీ రాజకీయ పొత్తుల కోసం ప్రయతిస్తోంది. అధికారికంగా అభ్యర్థులను ప్రకటించకపోయినా కడప, ప్రొద్దుటూరులో అభ్యర్థులు ఆర్ మాధవీరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రచారం కొనసాగిస్తున్నారు. మాధవీరెడ్డికి టికెట్ వచ్చే పరిస్థితి లేదని కార్పొరేటర్ ఉమాదేవి కుటుంబం ఇప్పటికీ బలంగా విశ్వసిస్తోంది. నారా లోకేష్ నుంచి అభయం వచ్చిన తర్వాతే తాము టీడీపీ కోసం విశేషంగా గ్రౌండ్ వర్క్ చేశామని పార్టీ టికెట్ తమదే అంటూ ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి వర్గీయులు అంటున్నారు. కుటుంబంలో ఒక్కరికే టికెట్ ఇవ్వనున్నట్లు టీడీపీ నుంచి సిగ్నల్స్ అందుతున్నాయి. ఈనేపథ్యంలో రాయ చోటిలో రమేష్‌రెడ్డికి టికెట్ దక్కితే, కడపలో మాధవీరెడ్డికి లభించదనే ధీమాతో ఉమాదేవి కుటుంబం ఉంది. అలాగే మాధవీరెడ్డికి టికెట్ ఖరారైతే, రాయ చోటిలో మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్‌రెడ్డికి దక్కే అవకాశం లేదనే భావన అక్కడి ఆశావహుల్లో వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితులల్లో చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని నేతల్లో టెన్షన్ కొనసాగుతోంది.

కమలాపురంలో పుత్తా తనయుడు

వరుసగా ఓటమి చెందిన నేతలకు టికెట్ ఇచ్చేది లేదని ఇదివరకు నారా లోకేష్ ప్రకటించారు. ఈనేపథ్యంలో కమలాపురం నుంచి వరసగా నాలుగుసార్లు పోటీచేసి ఓడిపోయినా పుత్తా నరసింహారెడ్డికి టికెట్ దక్కే అవకాశం లేదని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి. ఈ క్రమంలో పుత్తా తనయుడు చైతన్యరెడ్డి పేరు తెరపైకి వస్తోంది. ఎలాగైనా సరే తమ కుటుంబమే పోటీలో ఉంటుందని సన్నిహితులతో పుత్తా నరసింహారెడ్డి వ్యాఖ్యలు చేయడం కూడా అందుకు బలం చేకూరుస్తోంది. మొన్నటి వరకు పుత్తా ప్రచారంలో ఉన్నా తాజాగా చైతన్యరెడ్డి పేరు తెరపైకి రావడం విశేషం. అలాంటి పరిస్థితి ప్రొద్దుటూరులో కూడా కన్పిస్తోంది. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అభ్యర్థిగా కుటుంబ సమేతంగా ప్రచారం చేసుకుంటున్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఇప్పటికే జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి తీవ్రస్థాయిలో వరదకు వ్యతిరేకంగా ఆరోపణలు చేశారు. అయినప్పటికీ వరద పేరు ఖరారైందని.. పదవీకాలం ముగుస్తున్న రాజ్యసభ సభ్యుడి బంధువులు, సన్నిహితులకు సమాచారం అందించినట్లు తెలిసింది.

రాజంపేటలో జనసేన బ్రేక్‌లు

రాజంపేట టీడీపీ టికెట్ కోసం ముగ్గురు ఆశావహులున్నారు. వీరందరిలో జనసేన పొత్తు కారణంగా టికెట్ దక్కదనే అభద్రతాభావం ఏర్పడింది. రాజంపేట టికెట్ జనసేన కోరుతున్న నేపథ్యంలో టీడీపీ ఆశావహులు బేల మొహం పెడుతున్నారు. ఇప్పటి వరకు తనకే పార్లమెంటు టికెట్ అనే భావనతో ఉన్న సుగవాసీ బాలసుబ్రమణ్యంలో కూడా అంతర్గతంగా ఆవేదన ఉన్నట్లు సమాచారం. బీజేపీతో టీడీపీ పొత్తు కుదిరితే, రాజంపేట పార్లమెంటు బీజేపీ కోరే అవకాశం లేకపోలేదనే సందిగ్ధత ఆయనలో ఉన్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో తెలుగుతమ్ముళ్లలో రోజు రోజుకు బీపీ పెరిగిపోతుంది. అదే విషయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఒకరు రాయచోటిలో అనుచరవర్గంతో బాహాటంగా చెప్పుకు రావడం గమనార్హం.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలకు హాజరైన విద్యార్థులు

రాయచోటి: జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆదివారం తొలిరోజున రెండు విడతల్లో (ఉదయం, మధ్యాహ్నం) సెకండియర్ సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. మొదటిరోజున 96 శాతం మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం 52 కేంద్రాల్లో 2317 మంది విద్యార్థులకు 2205 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 44 కేంద్రాలలో 1520 మందికి 1461 మంది హాజరయ్యారు. పరీక్షలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య పర్యవేక్షించారు.

వైఎస్సార్ జిల్లాలో..

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీటియట్ జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. మొదటి స్పెల్‌ల్లో భాగంగా తొలిరోజు జిల్లాలో 55 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించారు. ఉదయం సెషన్‌లో 2232 మంది హాజరు కావాల్సి ఉండగా 2149 హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 1473 హాజరుకావాల్సి ఉండగా 1424 హాజరయ్యారు. ఉదయం, సాయంత్రం కలిపి 3705 మంది హాజరుకావాల్సి ఉండగా 3573 హాజరుకాగా 132 మంది గైర్హాజరయ్యారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తపల్లె పంచాయతీ సందిరెడ్డిగారిపల్లెకు చెందిన లక్ష్మీపతి భార్య కె.మమత(22) కుటుంబ సమస్యలతో మనస్తాపంతో పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

నాటుసారా స్వాధీనం

పెద్దమండ్యం : నాటుసారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.వెంకటేష్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెలిగల్లుకు సమీపంలో నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. వెలిగల్లుకు చెందిన టి.రమేష్ (25) వద్ద 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం



అదృశ్యమైన వివాహిత లక్ష్మీదేవి

వేంపల్లె : వేంపల్లె మండలం మిట్టపల్లె గ్రామానికి చెందిన వడ్డేమాను లక్ష్మీదేవి(36) అనే వివాహిత అదృశ్యమైందని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈమె మానసిక స్థితి సరిగా లేదని ఆయన తెలిపారు. ఆమె భర్త సుదర్శన్‌రెడ్డి ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్నారని చెప్పారు. ఈ మేరకు జనవరి 31వ తేదీన ఆయన విధుల నుంచి ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించకుండా పోయింది. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుదర్శన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కళాశాలకు వెళ్లి..

బి.కొత్తకోట : కళాశాలకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైన ఉదంతంపై ఆదివారం కేసు నమోదు చేశామని సీఐ సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని కంబాలపల్లెకు చెందిన విద్యార్థిని యు.హిందూ (17) విశ్వం కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈనెల 8న కళాశాలకు వెళ్లేందుకు ఇంటినుంచి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దీనిపై హిందూ ఆచూకీ కోసం కుటుంబీకులు వెతికినా ఫలితం లేదు. దీంతో తండ్రి మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు

విద్యార్థుల్లో మేధాశక్తి వెలికితీయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని వెలికి తీయాలని కడప డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ అంచెల విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో లేఖ విశేషాల గురించి విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించారు. పోస్టల్ ఉద్యోగులు మునాఫ్, సుబ్బరాయుడు, సునీత దేవి పాల్గొన్నారు.

టమాటా.. బతుకు బాట!

- జీవనోపాధికి కేరాఫ్ టమాటా మార్కెట్
- వందలాది మందికి లబ్ధి
- ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్



మండీల వద్ద పనులు చేస్తున్న కూలీలు

మదనపల్లె సిటీ : మదనపల్లె వ్యవసాయ టమాటా మార్కెట్ ఆసియా ఖండంలోనే అతి పెద్దది. ఈ మార్కెట్‌పై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. రైతులు పండించిన టమాటాను మార్కెట్‌కు తరలిస్తే అక్కడి నుంచి లారీలు, వాహనాల్లో పొరుగు రాష్ట్రాలకు తరలించడంలో కూలీలు కీలకపాత్ర పోషిస్తున్నారు. పడమటి ప్రాంతమైన మదనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, రామసముద్రం, నిమ్మనపల్లె, వాల్మీకిపురం, గుర్రంకొండ ప్రాంతాల్లో రైతులు అధికంగా టమాటా సాగు చేస్తారు. పండించిన టమాటాలను మదనపల్లె మార్కెట్‌కు తరలిస్తారు. మదనపల్లె వ్యవసాయ మార్కెట్ 1979లో ప్రారంభించారు. అప్పటి నుంచి మార్కెట్ దినదినాభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం 180 మందికిపైగా ట్రేడ్ లైసెన్సు, మండీ వ్యాపారులున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల నుంచే కాకుండా సీజన్‌లో అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాతో పాటు సమీప రాష్ట్రమైన కర్ణాటకలోని రాయల్‌పాడు, శ్రీనివాసపురం, అడ్డగళ్, లక్షిపురం క్రాస్ నుంచి వేలాది మంది రైతులు టమాటాలను మార్కెట్‌కు తెస్తున్నారు. మార్కెట్‌కు మార్చి నెలాఖరు నుంచి జులై వరకు సీజన్ బాగా ఉంటుంది. రోజుకు సగటున 150 టన్నుల నుంచి 200 టన్నుల వరకు కాయలు వస్తాయి. ఇక్కడి నుంచి తమిళనాడు, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, హర్యానా,రాజస్థాన్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఎంతో మందికి ఉపాధి

మార్కెట్ యార్డులో ఎంతో మందికి ఉపాధి లభిస్తోంది. కాయలను గ్రేడింగ్ చేయడం, వాటిని ట్రేలలో పేర్చి పేపర్‌తో ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి లారీల్లో లోడింగ్ చేస్తారు. దీంతో కాయలు దెబ్బతినకుండా అమ్మకాలు సులభంగా చేసుకోవచ్చు. ఈ పనులు ఎక్కువ మంది మహిళలు లబ్ధి పొందుతున్నారు.

సుమారు 600 మందికిపైగా కూలీలు పని చేస్తున్నారు. రోజు కూలీలు సగటున ఒక్కొక్కరు రూ.700–800 వరకు సంపాదిస్తున్నారు. దీంతో వారి కుటుంబ అవసరాలు తీరుతున్నారు.

మార్కెట్ ఆదుకుంటుంది



మార్కెట్ నా కుటుంబాన్ని ఆదుకుంటుంది. 10 సంవత్సరాల నుంచి మార్కెట్‌లో పని చేస్తున్నాను. కాయలను గ్రేడింగ్ చేసి ట్రేలల్లో నింపుతాను. ప్రతి రోజు పని దొరుకుతుంది. కూలీ డబ్బులు కూడా ఆ రోజే ఇస్తారు. ఇది మాకు ఎంతో ఆదరువుగా ఉంది.

– చిలకమ్మ, కూలీ, టమాటా మార్కెట్, మదనపల్లె

లోడింగ్ చేయడంతో ఉపాధి



క్రేట్‌ల్లో నింపిన టమాటాలను లారీల్లో లోడింగ్ చేస్తాం. గత 10 సంవత్సరాలుగా పని చేస్తున్నా. కాయలు దెబ్బతినకుండా లోడింగ్ చేస్తాం. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లినా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. మార్కెట్ వల్ల మాకు రోజు ఉపాధి దొరుకుతుంది.

– లక్ష్మినారాయణ, కూలీ, టమాటా మార్కెట్, మదనపల్లె

ప్రత్యేకంగా ప్యాకింగ్



కాయలు గ్రేడింగ్ చేసిన తరువాత కాయలు దెబ్బతినకుండా ట్రేలపై పేపర్ ప్యాకింగ్ చేస్తాం. ఇలా చేయడం వల్ల కాయలు నాణ్యత అలాగే ఉంటాయి. ప్యాకింగ్ పనులు గత 10 సంవత్సరాల నుంచి చేస్తున్నా. మార్కెట్‌లో నిత్యం పనులు ఉంటాయి.

– షాను, మహిళా కూలీ, టమాటా మార్కెట్, మదనపల్లె

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

నాడు-నేడుతో పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు



ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసింది. అదనపు తరగతి గదులను నిర్మించడంతో పాటు సురక్షిత తాగునీరు, తరగతి గదులలో లైటింగ్, ఫ్యాన్‌లు, ప్రహరీలు, బెంచీలు, అధునాతన టాయిలెట్లు తదితర అన్ని సౌకర్యాలు కల్పించారు. పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పెయింటింగ్ వేశారు. విద్యాకానుక పథకం ద్వారా విద్యార్థులకు యూనిఫాం, బ్యాగ్స్, షూస్, బెల్ట్, టై, ఇంగ్లీషు డిక్షనరీ, పుస్తకాలు, ల్యాప్‌టాప్‌లు ఉచితంగా అందిస్తున్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం పెడుతున్నారు. విద్యార్థులు ఆసక్తిగా పాఠశాలకు వచ్చి విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది.

– ఎస్.ఇమాం హుస్సేన్, ప్రధానోపాధ్యాయుడు, మున్సిపల్ ఉర్దూ హైస్కూల్, ప్రొద్దుటూరు

పైసా ఖర్చు లేకుండానే సర్టిఫికెట్లు పొందాను



గతంలో కుల, ఆదాయం సర్టిఫికెట్లను పొందాలంటే మీసేవలో దరఖాస్తు చేసుకొని తహసీల్దారు కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేయాల్సి ఉండేది. కార్యాలయంలో వీఆర్ఓ ఉంటే, ఆర్ఐ ఉండరూ, వీరిద్దరూ ఉంటే తహసీల్దారు ఉండరు. దీంతో సర్టిఫికెట్లు చేతికి వచ్చే సరికే దాదాపు వారం, పదిరోజులు పట్టేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం పెట్టిన తరువాత వలంటీర్ మా ఇంటికి వచ్చి ఆధార్, రేషన్ కార్డులు తీసుకొని పైసా ఖర్చు లేకుండా కుల, ఆదాయం సర్టిఫికెట్లను తెచ్చి ఇచ్చారు. ఆఫీసుల చుట్టు తిరగకుండా జగనన్నసురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాము.

– బొమ్మనబోయిన సుబ్బరాయుడు, గాంధీవీధి, సిద్దవటం

నెరవేరిన సొంతింటి కల



నవరత్నాల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇల్లులేని నిరుపేదలకు వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఇల్లు మంజూరు చేస్తామని చెప్పారు. వెంటనే ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం ఇంటిని కూడా పూర్తిస్థాయిలో నిర్మించుకున్నాము. నేటి కాలానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి దయ వలన సొంతింటి కల నెరవేరింది. మా కుటుంబం ఎప్పటికీ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటుంది.

– తోడేటి నరసమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

నాటకీయ పరిణామాల మధ్య
మైనర్ బాలిక వివాహం



వరుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మహిళా పోలీసు

గోపవరం : నాటకీయ పరిణామాల మధ్య మైనర్ బాలిక వివాహం ఆదివారం తెల్లవారుజామున జరిగింది. మైనర్ బాలిక వివాహాన్ని అడ్డుకునేందుకు ఐసీడీఎస్, పోలీసులు చేసిన ప్రయత్నం విఫలమైంది. బాల్యవివాహాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూ ఎప్పటికప్పుడు బాల్యవివాహాలు జరగడం వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ ర్యాలీలతో పాటు అవగాహన కల్పించినా ఇంకా అక్కడక్కడా బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయి. మండలంలో ఆదివారం తెల్లవారుజామున వివాహమే ఇందుకు నిదర్శనం. వివరాల్లోకి వెళితే శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా కలువాయి మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన ఓ మైనర్ బాలికను గోపవరం మండలం బ్రాహ్మణపల్లెలోని గాలిబోయినజయన్న, మల్లమ్మ దంపతుల కుమారుడు నరసింహులుకు ఇచ్చి వివాహం చేసేందుకు వరుని స్వగృహంలో ఆదివారం తెల్లవారుజామున 4–30 గంటలకు నిర్ణయించారు. అయితే వివాహం జరుగుతున్న మైనర్ బాలిక ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతూ 17 సంవత్సరాలే ఉండటంతో స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కలువాయి పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు మైనర్ బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్ బాలికకు వివాహం చేస్తే జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించారు. దీంతో అధికారుల ముందు తమ బిడ్డకు పెళ్లి చేయమని అంగీకార పత్రంలో తల్లిదండ్రులు సంతకాలు చేశారు. అయితే అధికారుల కళ్లుగప్పి ఎట్టకేలకు వివాహం చేసేందుకు మైనర్ బాలికను వరుని స్వగ్రామానికి తరలించారు. అక్కడ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, మహిళా పోలీసు విష్ణుప్రియ ఆదివారం తెల్లవారుజామున 1 గంట ప్రాంతంలో పోలీసుల రక్షణతో వరుని స్వగ్రామానికి వెళ్లారు. అప్పటికి మైనర్ బాలిక అయిన పెళ్లి కుమార్తె అక్కడికి చేరుకోలేదు. ఎట్టిపరిస్థితుల్లో మైనర్ బాలికతో వివాహం జరపకూడదని వరుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తెల్లవారుజామున 5 గంటల వరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మహిళా పోలీసు వరుని ఇంటి వద్దే ఉన్నారు. అయితే ఇక్కడ కూడా వరుడు తల్లిదండ్రులతో పారిపోయి మధ్యలో మైనర్ బాలికతో వివాహ కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాడు. అయితే బాల్యవివాహాన్ని అడ్డుకునేందుకు ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో చేసేదేమీ లేక వెనుదిరిగారు.

ఎరువుల నిల్వలు పుష్కలం

- అందుబాటులో 21,500 మెట్రిక్ టన్నులు
- ఇప్పటికే 12500 మెట్రిక్ టన్నులు సరఫరా
- అన్ని రకాల ఎరువులు కలిపి రైతులకు అందుబాటులో 4 వేల మెట్రిక్ టన్నులు



రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అందుబాటులో ఉన్న యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో రబీ సీజన్‌కు అనుగుణంగా రైతులకు అవసరానికి తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోని 400 రైతు భరోసా కేంద్రాలలో వీటిని నిల్వ ఉంచి రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వం నేరుగా యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులను తక్కువ ధరలకే రైతులకు అందిస్తుండటంతో బయట మార్కెట్లో ఎక్కువ ధరలకు విక్రయించకుండా ధరలకు కళ్లెం పడింది.

రెండు నెలల్లో భారీగా వినియోగం

రబీ సీజన్ పంటసాగులో ఫిబ్రవరి, మార్చి నెలల్లో కాంప్లెక్స్ ఎరువులను అధికంగా రైతులు వాడుతుంటారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అన్నమయ్య జిల్లాకు 4 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచింది. అందులో 21,500 మెట్రిక్ టన్నుల యూరియాను భరోసా కేంద్రాలకు తరలించింది. ఇందులో ఇప్పటికే 12500 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు కొనుగోలు చేసి వినియోగించుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తెలిపారు. మార్చి 31 నాటికి మిగిలిన యూరియా నిల్వలను కూడా విక్రయించే చర్యలు చేపట్టామన్నారు. సాగైన పంటలు వరి, టమాటా, అరటి, మామిడి, వేరుశనగ పంటలకు కాంప్లెక్స్ ఎరువులతో కలిపి యూరియాను ఎక్కువగా వాడతారన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను సిద్ధంగా ఉంచిందంటే ప్రభుత్వం ముందుచూపును అర్థం చేసుకోవచ్చన్నారు. వాస్తవానికి నిరుడు వానకాలం సీజన్‌లో జిల్లాలో 17 వేల మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం మాత్రమే అయింది. అయినా ప్రస్తుతం సాగు విస్తీర్ణం పెరుగుతుందన్న అంచనా మేరకు నిల్వలు భారీగా పెంచామన్నారు. యూరియాతో పాటు డీఏపీ, ఎన్‌పీకే, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ వంటి ఎరువులు సైతం పుష్కలంగా అందుబాటులో ఉన్నాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి



సాయిలక్ష్మీనాథరావు (ఫైల్)



ప్రమాదంలో మృతి చెందిన సాయిలక్ష్మీనాథరావు

మైదుకూరు : మైదుకూరు పట్టణ శివారులో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రొద్దుటూరుకు చెందిన నిప్పాని సాయిలక్ష్మీనాథరావు (39) అనే ఫొటోగ్రాఫర్ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరులోని కోట వీధికి చెందిన సాయి లక్ష్మీనాథరావు స్థానిక గాంధీ రోడ్డులో సాయి స్టూడియో పేరుతో ఫొటో స్టూడియోను నడుపుతున్నాడు. కడపలో జరిగే ఓ వివాహ వేడుకకు ఫొటోలు తీసేందుకు ఆదివారం ప్రొద్దుటూరు నుండి బైక్‌పై మైదుకూరు మీదుగా బయల్దేరాడు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో నెల్లూరు – బళ్లారి జాతీయ రహదారిపై మైదుకూరు శివారులోని బాలాజీ స్టీల్స్ ఫ్యాక్టరీ సమీపంలో వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో సాయి లక్ష్మీనాథరావు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కారు నడుపుతున్న వ్యక్తికి గాయాలు కాగా.. చికిత్స కోసం అతను ప్రొద్దుటూరుకు వెళ్లినట్టు సమాచారం. అతని పేరు కృష్ణ అని తెలుస్తోంది. మృతి చెందిన సాయి లక్ష్మీనాథరావు భార్య కల్పన ప్రస్తుతం గర్భిణిగా ఉన్నట్టు తెలుస్తోంది. సంఘటనపై మృతుని సోదరుడు శ్రీనివాసరావు మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అర్బన్ ఎస్ఐ ఘన మద్దిలేటి సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గొలుసుల దొంగ అరెస్టు



బంగారు గొలుసుల దొంగ అరెస్టు చూపుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్ రెడ్డి, సీఐ శంకర్‌రెడ్డి

పులివెందుల : బంగారు గొలుసులు దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేశామని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతనెల 25వ తేదీన పట్టణంలోని కదిరిరోడ్డు పక్కన గల ఇంటిలో మహిళ ఒంటరిగా ఉండగా మాస్కు ధరించి కత్తి తీసుకొచ్చిన గుర్తు తెలియని అగంతకుడు ఇంట్లోకి ప్రవేశించాడన్నారు. మహిళపై దాడి చేసి ఆమె మెడలోని రెండు బంగారు గొలుసులను లాక్కొని పారిపోయాడన్నారు. ఈ సంఘటనకు సంబంధించి బాధిత మహిళ ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేశామన్నారు. సీసీ కెమెరాల పరిశీలనలో భాగంగా సాక్షుల విచారణ అనంతరం ఈ కేసులో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. పులివెందుల అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ అరుణ్‌రెడ్డిలతోపాటు పోలీసు సిబ్బంది గాలింపు చర్యలలో భాగంగా రింగ్ రోడ్డులో ఉన్న మల్లెల వెంకటేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా.. తాను బంగారు గొలుసులు దొంగతనం చేసినట్లు అంగీకరించాడన్నారు. అతని వద్ద ఉన్న రెండు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రాష్ట్రానికి ఏం చేసిందని బీజేపీతో టీడీపీ పొత్తు



మాట్లాడుతున్న జి. ఈశ్వరయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమి చేసిందని ఆ పార్టీతో టీడీపీ పొత్తు పెట్టుకుంటోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి .ఈశ్వరయ్య ప్రశ్నించారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఏం చేసిందని టీడీపీ పొత్తుకు సిద్ధమైందో చంద్రబాబు ప్రజలకు చెప్పాలన్నారు. 2014 నుంచి 18 వరకు బీజేపీతో కలిసి ఉండి చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలు ఏవీ నెరవేర్చలేదన్నారు. బీజేపీ మతతత్వ పార్టీ అని లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు 2018లో ఢిల్లీలో ధర్మ పోరాట దీక్ష చేసిన చంద్రబాబు ఇప్పుడు బీజేపీ ఏం చేసిందని పొత్తు పెట్టుకుంటున్నారని నిలదీశారు. చంద్రబాబు వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలు, అవినీతి కేసులకు భయపడి బీజేపీతో అనైతిక పొత్తు పెట్టుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు.దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం పట్టిపీడిస్తున్నాయని, దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న బీజేపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటశివ, సి.సుబ్రమణ్యం, వి.గంగా సురేష్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్ డైరెక్టర్ వెంకట క్రిష్ణారెడ్డికి సన్మానం

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ జోన్ పరిధిలో ఆర్‌జేడీగా వెంకట క్రిష్ణారెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతం దిశగా కృషి చేశారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న అన్నారు. వెంకట క్రిష్ణారెడ్డి మోడల్ స్కూల్స్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనను ఆదివారం సన్మానించారు.

టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి

- ఆపూస్మ ఉపాధ్యాయ శిక్షణ తరగతుల్లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్యాలను ఎప్పటికప్పుడు నేర్పుతూ ప్రపంచ స్థాయి పోటీలను తట్టుకునేలా తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం కడప జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఆపూస్మ) ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యావిధానంలో సరికొత్త సవాళ్లను ఎదుర్కోవాలంటే ఎప్పటికప్పుడు నూతన జ్ఞానాన్ని పొందాల్సి ఉందన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



వజ్రపు కిరీట ధారణలో వాసవీ మాత



పాల్గొన్న ఆర్యవైశ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా వజ్రపు కిరీటంతో అలంకరించారు. లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను వేదపండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించి పట్టు వస్త్రాలు, హోమద్రవ్యాలు, పూజా ద్రవ్యాలను పూర్ణాహుతిగా సమర్పించి అమ్మవారిని శరణువేడారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య చిన్నారులు రకరకాల పూలను నింపిన 102 గంపలను చేత పట్టుకుని పురవీధుల్లో వాసవీ నామస్మరణల మధ్య ఊరేగించారు. అనంతరం ఆ పూలతో అమ్మవారికి పుష్పాభిషేకం చేశారు. రాత్రి 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు సామూహికంగా లక్ష కుంకుమార్చన ఆచరించారు. వాసవీమాతను పసుపు, కుంకుమ, దీపాలు, నైవేద్యంతో అర్పించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు రాంమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.